రంజాన్ వేళలు
ఇఫ్తార్: 6:33 (శనివారం సాయంత్రం) సహర్: 4:56 (ఆదివారం ఉదయం)

శ్రమించి.. కొలువు సాధించి 7
● నాలుగు ఉద్యోగాలు సాధించిన ముద్దాపూర్ ముద్దుబిడ్డ

ఆర్టీసీ బస్టాండ్లలో దాహం..దాహం

తాగునీరు లేక గొంతెండుతున్న ప్రయాణికులు

నిరుపయోగంగా ఫిల్టర్లు, ఫ్రిజ్‌లు
కంపుకొడుతున్న ట్యాంకులు
ఎండలు మండుతున్నా దృష్టిపెట్టని అధికారులు
దాహం తీర్చుకోవాలంటే వాటర్ బాటిల్ కొనాల్సిందే


సిద్దిపేట బస్టాండ్‌లో ఫిల్టర్ పనిచేయక నల్లా వద్ద నీళ్లు తాగుతున్న ప్రయాణికులు

ఆంధ్రజ్యోతి విజిట్


సదాశివపేట బస్టాండ్‌లో నిరుపయోగంగా ఫిల్టర్

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మార్చి 21: ఉమ్మడి మెదక్ జిల్లాలోని మూడు ప్రధాన బస్టాండ్లలో తాగునీటికి తండ్లాట నెలకొన్నది. ఓవైపు ఎండలు మండుతుంటే మరోవైపు బస్టాండ్లలో ప్రయాణికులకు తాగునీరు కరువైంది. ఆర్టీసీ సంస్థకు ప్రయాణికులే దేవుళ్లు అంటూ సంబోధించే అధికారులు.. ఆ ప్రయాణికుల దాహన్ని తీర్చలేక పోతున్నారు. కొన్ని బస్టాండ్లలో మొత్తానికే మంచినీటి వసతి లేకపోగా మరికొన్ని చోట్ల తాగునీటి సౌకర్యం ఉన్నా నిర్వాహణ లోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది.

కొరవడిన పర్యవేక్షణ

ఆర్టీసీ బస్టాండ్లపై అధికారుల పర్యవేక్షణ కొరవడింది. వేసవి రాగానే ప్రధానంగా తాగునీటి వసతి గురించి సమీక్షించాల్సి ఉంది. కానీ ఆ దిశగా చర్యలు తీసుకున్నట్లుగా లేదు. ఇప్పటికే ఎండలు మండుతున్నాయి. ప్రయాణికులు ఇళ్ల వద్ద నుండి నీళ్ల సీసాలు తెచ్చుకున్నా దాహం తీరడం లేదు. బస్టాండ్లలో ఉన్న తాగునీటి ట్యాంకులు అపరిశుభ్రంగా కనిపిస్తున్నాయి. ఫ్రిజ్‌లు మూలకుపడ్డాయి. గ్లాసులు లేక దోసిట్లో పట్టుకొని నీళ్లు తాగుతున్నారు. తాగునీటి విషయంలో ప్రయాణికుల నుండి ఫిర్యాదులు వస్తున్నాయి. ఆర్టీసీ అధికారులు ఈ దిశగా చర్యలు చేపట్టాల్సి అవసరం ఎంతైనా ఉంది. బస్సుల్లో ప్రయాణించేవారిలో చాలామందికి మంచినీటిని కొనుగోలు చేసే స్తోమత ఉండదు. ఈ సమయంలో అస్వస్థతకు

మిగతా 7వ పేజీలో..

సిద్దిపేట జిల్లా కేంద్రంలోని మోడ్రన్ బస్టాండ్‌లో ఏర్పాటుచేసిన తాగునీటి ఫ్రిజ్ పనిచేయడం లేదు. దీంతో ఓవర్‌హెడ్ ట్యాంకుతో కనెక్షన్ ఉన్న నల్లా నీటినే ప్రయాణికులు తాగుతున్నారు. ఇక్కడ గ్లాసులు ఏర్పాటు చేయలేదు. టాయ్‌లెట్‌కు వెళ్లొచ్చినవారు సైతం ఇక్కడే చేతులు కడుగుతున్నారు.

మెదక్ జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్‌లో తాగునీరు అందుబాటులో లేదు. కొత్త బస్టాండ్‌లో ట్యాంకు నుంచి నీటి వసతి కల్పించినప్పటికీ పరిసరాలు అపరిశుభ్రంగా ఉన్నాయి. బస్టాండ్‌లో పరిస్థితి తెలిసే ప్రయాణికులు ఇంటి నుంచి నీళ్ల సీసాలు తెచ్చుకుంటున్నారు. లేకపోతే దాహానికి తాళలేక డబ్బులు చెల్లించి వాటర్ బాటిళ్లు కొనాల్సిందే. నిత్యం 30వేల మంది ప్రయాణికులు రాకపోకలు సాగించే బస్టాండ్‌లో పరిస్థితి దారుణంగా ఉంది.

జిల్లాకేంద్రమైన సంగారెడ్డి ప్రధాన బస్టాండ్‌లో తాగునీటి వసతి లేదు. నిత్యం వందలాది బస్సులు, వేలాదిగా ప్రయాణికులు ఇక్కడి నుంచి రాకపోకలు సాగిస్తుంటారు. బస్టాండ్‌లో తాగునీటి సౌకర్యం లేక డబ్బులు చెల్లించి నీళ్లను కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఉంది. బ్రాండెడ్ కాని వాటర్ బాటిళ్లను విక్రయించి వ్యాపారులు సొమ్ము చేసుకుంటున్నారు. ఆర్టీసీ సంస్థకు ఆదాయాన్ని కురిపిస్తున్న ప్రయాణికులకు కనీసం మంచినీటి వసతిని ఏర్పాటు చేయలేక పోతున్నారనే విమర్శలు ఉన్నాయి.


తొగుట మార్కెట్ యార్డులో తడిసిపోతున్న పొద్దుతిరుగుడు గింజలు

హమ్మయ్య.. కాస్త చల్లబడింది

● జిల్లాలో పలుచోట్ల భారీ వర్షం
● అనాజీపూర్‌లో వడగండ్ల వాన

రాయపోల్/గజ్వేల్/తొగుట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కొన్నిరోజులుగా సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతుండగా.. శుక్రవారం సాయంత్రం వాతావరణం చల్లబడి చిరుజల్లులు కురిశాయి. వేడి ఉక్కపోతతో అల్లాడుతున్న జనం కాస్త ఉపశమనం పొందారు. సాయంత్రం 5 గంటల నుంచే మబ్బులు కమ్ముకున్నాయి. 7 నుంచి దాదాపు గంటన్నర పాటు ఉరుములతో కూడిన వర్షం కురిసింది. రాయపోల్ మండలంలో మోస్తరు వర్షం పడింది. అనాజీపూర్‌లో ఐదు నిమిషాల పాటు పెద్దగా వడగండ్లు పడ్డాయి. దీంతో పొట్ట దశలో ఉన్న వరిచేలకు నష్టం వాటిల్లే అవకాశం ఉంది. గజ్వేల్‌తో పాటు డివిజన్ వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసింది. ఎండిపోయే దశలో ఉన్న వరితో పాటు ఆయా పంటలకు ఊపిరిపోసినట్లుగా రైతులు ఆనందపడుతున్నారు. తొగుట మండలం వివిధ గ్రామాల్లో శుక్రవారం రాత్రి ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకాల వర్షానికి విద్యుత్ సరఫరా నిలిచి పోయింది. తొగుట మార్కెట్ యార్డులో పొద్దుతిరుగుడు గింజలు అకాల వర్షానికి తడిసిపోయాయి.


రాయపోల్ మండలం అనాజీపూర్‌లో పడిన వడగండ్లు


సిద్దిపేటలో కురుస్తున్న వర్షం

కొనుగోళ్లకు సన్నద్ధం

● జిల్లాలో 419 కేంద్రాల ఏర్పాటు
● 5 లక్షల మెట్రిక్ టన్నుల దిగుబడి అంచనా..
● సన్నాలకు, దొడ్డు రకాలకు వేరువేరు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు..
● కొనుగోళ్లలో రైతులకు ఇబ్బందులు రావద్దు
● అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్

సిద్దిపేట కలెక్టరేట్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): యాసంగి సీజన్‌లో రైతులు పండించిన ధాన్యా న్ని మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు జిల్లా అధికారులు కసరత్తు చేస్తున్నారు. జిల్లాలో కొన్నిచోట్ల వరి చేను చిరు పొట్ట దశలో ఉంది. ఏప్రిల్‌లో పూర్తిస్థాయిలో వరికోతలు కానున్నాయి. జిల్లావ్యాప్తంగా 419 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయనున్నారు. అందులో 211 ఐకేపీ , 202పీఏసీఎస్, 6 మెప్మా ఆధ్వర్యంలో కొనుగోళ్లు జరగనున్నాయి. టార్పాలిన్లు, తేమ యంత్రాలు, ప్యాడీ క్లీనర్లు, తూకం యంత్రాలు, గన్నీ బ్యాగులతో పాటు ఇతర సామగ్రిని ఆయా శాఖలు సమకూర్చనున్నాయి. ఈ ఏడాది యాసంగిలో జిల్లావ్యాప్తంగా 3.50 ఎకరాల్లో వరి సాగు చేయగా... 8.95 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి రావొచ్చని వ్యవసాయశాఖ అంచనా వేసింది. ఇందులో మిల్లర్లు కొనుగోలు చేసేవాటితో పాటు రైతు, స్థానిక అవసరాలకు పోనూ ప్రభుత్వ రంగ మార్కెట్లకు 4.70 లక్షల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం, 30 వేలు మెట్రిక్ టన్నుల సన్నధాన్యం వరకు వచ్చే అవకాశం ఉందని అంచనా వేశారు. ప్రభుత్వ కేంద్రాల్లో గ్రేడ్-ఏ ధాన్యం క్వింటాకు రూ.2203, సాధారణ రకమైతే రూ.2183 చెల్లించనున్నారు. సన్నధాన్యానికి క్వింటాలుకు రూ. 500 బోనస్‌ను సైతం అందించనున్నారు.

ఏప్రిల్‌లో దశలవారీగా

యాసంగిలో రైతులు సాగు చేసిన వరి కోతలు ఇంకా మొదలుకాలేదు. ఏప్రిల్‌లో కొనుగోళ్లు దశల వారీగా కేంద్రాలు తెరవాలని అధికారులు నిర్ణయించారు. గన్నీ బ్యాగుల కొరత రాకుండా ఉండేందుకు ముందస్తు చర్యలు తీసుకుంటున్నారు. 1.25 కోట్ల గన్నీ బ్యాగుల అవసరం ఉండగా.. 20లక్షల గన్ని బ్యాగులు అందుబాటులో ఉన్నాయి. దశలవారీగా అన్ని బ్యాగులు రానున్నాయి. మిల్లర్లు బ్యాంక్ గ్యారంటీ ఇస్తేనే ధాన్యాన్ని కేటాయించనున్నారు.

పకడ్బందీగా కొనుగోళ్లు

ధాన్యం కొనుగోళ్లను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు ఇప్పటి నుంచే ఏర్పాట్లపై దృష్టి సారించారు. ఈ మేరకు జిల్లా అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్, డీఎస్‌వో తనూజశ్రీ, డీఎం ప్రవీణ్ కుమార్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి నాగరాజుతో కలసి జిల్లాలో సంబంధిత శాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. రైతులకు ఇబ్బందులు లేకుండా కొనుగోలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. వరి కోసేటప్పుడు హార్వెస్టర్‌తో (19-20) ఆర్‌పీఎం ఉండేలా రైతులకు అవగాహన కల్పించాలని ఆయన అధికారులను ఆదేశించారు. సన్నాళ్లకు, దొడ్డు ధాన్యానికి వేరువేరుగా కేంద్రాలు ఏర్పాటు చేయాలని తెలిపారు.

నేటి నుంచి ఇంటర్మీడియట్ మూల్యాంకనం

సిద్దిపేట కల్చరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల జవాబు పత్రాల మూల్యాంకనం శనివారం నుంచి ప్రారంభమవుతుందని మూల్యాంకన కేంద్రం కన్వీనర్, జిల్లా ఇంటర్ విద్యాధికారి రవీందర్‌రెడ్డి చెప్పారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల (కోఎడ్యుకేషన్)లో ఏర్పాటు చేసిన క్యాంపు కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. తెలుగు, పొలిటికల్ సైన్స్, గణితం, హిందీ, ఇంగ్లిష్ సబ్జెక్టులకు సంబంధించిన ఎగ్జామినర్లు సకాలంలో క్యాంపు కార్యాలయంలో రిపోర్టు చేయాలని సూచించారు. సంబంధిత కళాశాల ప్రిన్సిపల్స్ ఆయా సబ్జెక్టుల అధ్యాపకులను రిలీవ్ చేయాలని చెప్పారు. మూల్యాంకన విధులకు హాజరయ్యే ప్రతి ఒక్కరూ సమయపాలన పాటించాలని లేదంటే చర్యలు తప్పవని హెచ్చరించారు.

తొలిరోజు 99.91%

● పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రారంభం
● 13 మంది గైర్హాజరు

సిద్దిపేట కల్చరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పదోతరగతి పరీక్షలు శుక్రవారం జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. జిల్లావ్యాప్తంగా ఏర్పాటు చేసిన 79 పరీక్ష కేంద్రాల్లో మొదటిరోజు 14114 మంది విద్యార్థులకు గాను 14101 మంది (99.91శాతం) విద్యార్థులు హాజరయ్యారు. 13 మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు జిల్లా విద్యాధికారులు తెలిపారు. శుక్రవారం తెలుగు, ఉర్దూ పరీక్షలు పూర్తయ్యాయి. ఎగ్జామ్ సెంటర్ల వద్ద పోలీసులు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశారు. ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు పరీక్ష కేంద్రాల వద్ద 163 బీఎన్ఎస్ఎస్ సెక్షన్‌ను అమలు చేశారు.

కేంద్రాలను సందర్శించిన కలెక్టర్, అదనపు కలెక్టర్

జిల్లా కేంద్రంలోని మూడు పరీక్ష కేంద్రాలను శుక్రవారం సిద్దిపేట కలెక్టర్ మనుచౌదరి ఆకస్మికంగా సందర్శించారు. పట్టణంలోని పారుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, మరో రెండు ప్రైవేట్ స్కూళ్లను కలెక్టర్ విజిట్ చేసి అధికారులకు పలు సూచనలు చేశారు. జిల్లా అదనపు కలెక్టర్ గరిమా అగ్రవాల్ ఇందిరానగర్ జడ్పీహెచ్ఎస్, ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలను సందర్శించారు. మరో 6 కేంద్రాలను జిల్లా విద్యాధికారి శ్రీనివాస్‌రెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ 6 కేం ద్రాలు, ఫ్లైయింగ్ స్క్వాడ్ బృందాలు 16 పరీక్ష కేంద్రాలను సందర్శించారు. వీరితో పాటు గా విద్యాశాఖ సెక్టోరియల్ ఆఫీసర్లు రామస్వామి, రంగనాథ్, ప్రభుత్వ పరీక్షల సహాయ నిర్వహణాధికారి లక్ష్మయ్య తదితరులు ఉన్నారు.

విద్యార్థులకు చిరు సాయం

చేర్యాల: కొమురవెల్లి మండలం గురువన్నపేటకు చెందిన పదోతరగతి విద్యార్థులు పరీక్షా కేంద్రానికి సకాలంలో వెళ్లేందుకు బస్సుసౌకర్యం లేక లేకపోవడంతో కిష్టంపేటకు బీఆర్ఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు బొంగు రాజేందర్‌రెడ్డి తన సొంత ఖర్చులతో ఉచిత ఆటో వసతి కల్పించారు. 29 మంది విద్యార్థులు సతమతమవుతుండటంతో రెండు ఆటోల ద్వారా రవాణా సౌకర్యం కల్పించారు. కొమురవెల్లి మం డలం మర్రిముస్త్యాలకు చెందిన మాజీ ఎంపీపీ తలారి కీర్తనకిషన్ తమ గ్రామానికి చెందిన విద్యార్థులకు ఉచిత ఆటో వసతి కల్పించారు.


విద్యార్థులను తనిఖీ చేసి లోపలికి అనుమతిస్తున్న అధికారులు


కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్


ఓ సెంటర్ వద్ద విద్యార్థులు, వారి తల్లిదండ్రులు


పరీక్ష కేంద్రంలో విద్యార్థులు

ఉద్రిక్తం

● సిద్దిపేటలో రంజాన్ కిట్లపై కొనసాగిన హైడ్రామా
● బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్య వాగ్వాదం
● సరుకుల పంపిణీలో రాజకీయమేమిటని ప్రశ్నించిన యువకులు
● తోఫాల కోసం బారులు తీరిన నిరుపేద ముస్లింలు
● పోలీసుల జోక్యంతో కిట్లు ఉన్న గదిని తెరిచిన మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్
● 6వేల మందికి పైగా తోఫాలను అందజేసిన నాయకులు


సిద్దిపేటలోని మదీనా ఫంక్షన్‌హాల్ వద్ద వివాదాలు చేస్తున్న ఇరుపార్టీల నాయకులు

సిద్దిపేట టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రంజాన్ సందర్భంగా ప్రతి ఏడాది మాదిరిగానే నిరుపేదలకు అందిస్తున్న రంజాన్ కిట్లపై రెండు రోజుల నుంచి బీఆర్ఎస్, కాంగ్రెస్‌ల మధ్య జరుగుతున్న నాటకీయ పరిణామలు శుక్రవారం హైడ్రామా నడుమ ముగిశాయి. ఉదయం నిరుపేద ముస్లింకు నిత్యావసర కిట్లను పంచుతున్నారన్న విషయం తెలుసుకుని ఇరుపార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు సిద్దిపేటలోని మదీనా పంక్షన్ హాల్ వద్దకు పెద్ద ఎత్తున చేరుకున్నారు. పోటాపోటీగా కిట్లు తాము పంచుతామంటే లేదు తామే పంచుతామంటూ నినాదాలతో హోరెత్తించారు. ఓ దశలో ఫంక్షన్‌హాల్ గేట్లను, పోలీసులను తోసేస్తూ ఇరుపార్టీల నాయకులు కిట్లు ఉన్న గది వద్దకు చేరుకున్నారు. కాసేపు ఉద్రిక్తత చోటు చేసుకోవడంతో పోలీసులు వారిని బయటకు తీసుకెళ్లి హాల్ గేటుకు తాళాలు వేశారు.


రంజాన్ కిట్లను పంపిణీ చేస్తున్న నాయకులు

వాగ్వాదం, మాటల యుద్ధం

శుక్రవారం ఉదయం ఆరు గంటలకు రంజాన్ కిట్ల పంపిణీ కార్యక్రమం ఉండటంతో బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు ఉదయం నాలుగు గంటల నుంచే స్థానిక మదీనా హాల్‌కు ఒక్కొక్కరుగా చేరుకున్నారు. ఉద యం ఆరు గంటలకు బీఆర్ఎస్ తరఫున మాజీ ఎమ్మెల్సీ ఫారుక్ హుస్సేన్, మున్సిపల్ మాజీ చైర్మన్ రాజనర్సు, పట్టణ అధ్యక్షుడు కొండం సంపత్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు పాల సాయిరాంతో పాటు తదితరులు చేరుకున్నారు. కాంగ్రెస్ తరఫున పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్, నాయకులు రాషాద్, వాహబ్ తదితరులు వచ్చారు. గది తాళాలు తెరవాలని, జకాత్‌లు ఎవరి సొంతం కావంటూ ఇరు పార్టీలు వాగ్వాదానికి దిగారు. మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌హుస్సేన్ అక్కడి చేరుకోగానే కాంగ్రెస్ నాయకులు నినాదాలు చేశారు. ఓ దశలో మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్‌కు, కాంగ్రెస్ నాయకుల మధ్య వాగ్వాదం చోటు చేసుకోగా పోలీసులు కల్పించుకుని గది తాళాలు తెరవాలని కోరారు. తాళాలను మాజీ ఎమ్మెల్సీ ఫారూఖ్ హుస్సేన్ తెరిచి వెళ్లిపోవడంతో కాంగ్రెస్ నాయకులు కిట్లను పంపిణీ చేశారు.

రాజకీయం తగదన్న యువకులు

నిరుపేదలకు అందిస్తున్న కిట్ల విషయంలో రాజకీయం తగదని అందరూ ఏకమై పంచాలని ఆ వర్గానికి చెందిన యువకులు స్థానిక నాయకులను నిలదీశారు. ఉపవాస దీక్షతో మహిళలు అర్ధరాత్రి నుండి వేచిచూస్తున్నారని వెంటనే పంపిణీ చేయాలని అక్కడున్న నాయకులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో గంటకు పైగా కొనసాగిన హైడ్రామా చివరికి పోలీసుల జోక్యంతో ముస్లింలకు కిట్లను పంపిణీ చేశారు.

తోఫాల కోసం బారులు

రంజాన్ సందర్భంగా శుక్రవారం ఉదయం ఆరు గం టలకు కిట్లను పంపిణీ చేస్తారన్న విషయం తెలియడంతో అర్ధరాత్రి నుంచే ముస్లింలు బారులు తీరారు. దాదాపు 6వేలకు పైగా రావడంతో పోలీసుల సహకారంతో వాలంటీర్లు రంజాన్ తోఫాలను పంపిణీ చేశారు.

మోహరించిన పోలీసులు

సిద్దిపేట ఏసీపీ మధు పర్యవేక్షణలో గజ్వేల్ ఏసీపీతో పాటు సిద్దిపేటకు చెందిన సీఐలు ఎస్ఐలు ఉదయం నుంచి పర్యవేక్షించారు. కిట్ల పంపిణీ సజావుగా జరగడంతో సమావేశాన్ని ఏర్పాటు చేసి సహకరించిన పోలీసులకు, కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జీ పూజల హరికృష్ణకు, పార్టీ శ్రేణులకు పట్టణ అధ్యక్షుడు అత్తుఇమామ్ కృతజ్ఞతలు తెలిపారు.

కొన్నేళ్ల నుంచి తోఫాలను అందజేస్తున్న హరీశ్

సిద్దిపేటక్రైం: రంజాన్ పర్వదినం పురస్కరించుకుని మాజీమంత్రి ఎమ్మెల్యే హరీశ్‌రావు కొన్నేళ్లుగా తనమిత్రుల సహకారంతో సిద్దిపేటలోని ముస్లింలకు తన వంతు సాయంగా తోఫాను పంపిణీ చేస్తున్నారని కౌన్సిలర్ మోహిజ్, మైనార్టీ నాయకులు అతిక్ అన్నారు. ఓర్వలేని కాంగ్రెస్ పార్టీ నేతలు రాజకీయం చేస్తున్నారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.

రేపే మల్లన్న చివరివారం జాతర

● ఆదివారం రాత్రి అగ్నిగుండాలు
● ముగియనున్న బ్రహ్మోత్సవాలు

చేర్యాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : భక్తుల పాలిట కొంగుబంగారంగా విలసిల్లుతున్న కొమురవెల్లి మల్లికార్జునస్వామి ఆలయంలో కొనసాగుతున్న బ్రహ్మోత్సవాలు రేపటితో ముగియనున్నాయి. ఆదివారం 10వ చివరివారం జాతర జరగనుంది. మార్గశిరమాసం చివరి ఆదివారమైన డిసెంబరు 29న జరిగిన స్వామివారి కల్యాణంతో ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు ఫాల్గుణ మాసం చివరి ఆదివారం రాత్రి నిర్వహించనున్న అగ్నిగుండాలతో ముగియనున్నాయి. వీరశైవ సాంప్రదాయం నిర్వహిస్తున్న అగ్నిగుండాల కార్యక్రమానికి వీరశైవుల జగద్గురు బర్దిపూర్ దత్తగిరిపీఠం మహామండలేశ్వర డాక్టర్ సిద్దేశ్వరానందగిరి మహాస్వామి నేడు కొమురవెల్లికి రానున్నారు. ఆయన పర్యవేక్షణలో అగ్నిగుండాలు నిర్వహించనున్నారు.

ఏర్పాట్లు పూర్తి : రామాంజనేయులు ఈవో

జాతర చివరి ఆదివారం కావడం, అగ్నిగుండాలు నిర్వహిస్తున్న క్రమంలో భక్తులు భారీగా తరలివస్తారు. తాగునీటి వసతితో పాటు ఎలాంటి ఇబ్బందులూ కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. స్వామివారి దర్శనం త్వరితగతిన అయ్యేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చర్యలు తీసుకుంటాం.

పరిశ్రమలో కార్మికుడి మృతి

శివ్వంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పరిశ్రమలో ఫ్యాన్ బిగిస్తుండగా కిందపడి కార్మికుడు మృతిచెందిన సంఘటన గురువారం చోటుచేసుకున్నది. నవాబ్‌పేట్‌కు చెందిన రాగాజు ప్రశాంత్(26) గుమ్మడిదల మండలం బొంతపల్లిలో ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. గురువారం పరిశ్రమలో ఫ్యాన్ బిగిస్తుండగా కిందపడి మృతిచెందాడు. ప్రశాంత్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

ఈతకు వెళ్లి బాలుడి మృతి

ఇంట్లో చెప్పకుండా ఇద్దరు పిల్లలతో కలిసి చెరువుకు

బాలుడు మృతిచెందాడని తెలిసి కన్నీరుమున్నీరైన తల్లిదండ్రులు

రామాయంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : స్కూలుకు వెళ్లొచ్చి సరదాగా ఈత కొడదామని వెళ్లిన విద్యార్థి చనిపోయిన ఘటన శుక్రవారం రామాయంపేట మండల పరిధి కాట్రియాలలో చోటుచేసుకున్నది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కాట్రియాల గ్రామానికి చెందిన రాజు, మంజుల దంపతుల కుమారుడు రికిత్(12) ఏడో తరగతి చదువుతున్నాడు. శుక్రవారం స్కూల్‌కి వెళ్లగా ఒంటిపూట కావడంతో మధ్యాహ్నం వరకు ఇంటికి వచ్చేశాడు. అనంతరం మరో ఇద్దరి పిల్లలతో కలిసి ఈత నేర్చుకునేందుకు ఊరి శివారులోని పెద్దచెరువు వద్దకు ఇంట్లో చెప్పకుండానే వెళ్లాడు. చెరువులోకి దిగి ఈత నేర్చుకుంటుంగా మునిగిపోయాడు. తమ కొడుకు చనిపోయాడని వార్త తెలుసుకుని తల్లిదండ్రు కన్నీరు మున్నీరయ్యారు. వెంటనే గజ ఈతగాళ్లతో వెతికించి మృతదేహాన్ని బయటకు తీయించారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



రికిత్ మృతదేహం

అప్పుల బాధతో ఒకరి ఆత్మహత్య

● వర్గల్ మండల కేంద్రంలో ఘటన

వర్గల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : అప్పుల బాధతో ఒకరు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శుక్రవారం సిద్దిపేట జిల్లా వర్గల్‌లో చోటుచేసుకున్నది. గౌరారం ఎస్ఐ కరుణకర్ రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. వర్గల్ గ్రామానికి చెందిన కిష్టనోల్ల నర్సింహులు(58) హమాలీ పని చేస్తుంటాడు. అతనికి భార్య అండాలు, కొడుకు, కూతురు ఉన్నారు. కాగా, సంవత్సరంన్నర క్రితం కూతరుకు వివాహం చేయడంతో రూ.10 లక్షల అప్పు అయింది. నాలుగు నెలల నుంచి నర్సింహులు కాలుకు గాయం కావడంతో పనికి వెళ్లకుండా ఇంటివద్ద ఉన్నాడు. రోజూ మద్యం తాగుతూ ఉండేవాడు. గురువారం రాత్రి మద్యం సేవించి ఇంటికి రావడంతో నర్సింహులతో భార్య అండాలు గొడవ పడింది. ఎందుకు తాగి వచ్చావని, అప్పులు ఎలా కడుదామని అడిగింది. శుక్రవారం నిద్రలేచేసరికి నర్సింహులు కౌలు చేస్తున్న పొలం వద్ద చెట్టుకు ఉరేసుకుని కనిపించాడు. భార్య అండాలు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృత దేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గజ్వేల్ ఆసుపత్రికి తరలించారు.



నర్సింహులు(ఫైల్)

అదృశ్యమైన యువతి ఆచూకీ లభ్యం

● కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు

పుల్‌కల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పుల్కల్ మండలం లక్ష్మీసాగర్ గ్రామ పరిసర తండాకు చెందిన యువతి లకావత్ స్వప్న ఆచూకీ దొరికింది. పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. లక్ష్మీసాగర్ ధౌర్యనాయక్ గిరిజన తండాకు చెందిన లకావత్ శోభన్ పెద్ద కూతురు స్వప్నను 2023 మార్చి నెలలో వికారాబాద్ జిల్లా మోమిన్‌పేట మండలం టేకులపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సుద్ద వడక తండాకు చెందిన పాండుకు ఇచ్చి వివాహం జరిపించారు. ఇష్టం లేని పెళ్లి చేశారంటూ అదే ఏడాది మే నెలలో పుట్టింటికి తిరిగి వచ్చింది. తల్లిదండ్రులు స్వప్నకు నచ్చజెప్పి అత్తవారింటికి పంపించారు. అదే ఏడాది మే 12వ భర్త పాండు, ఇతర బంధువులు ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. ఈ విషయమై అప్పట్లో తండ్రి లకావత్ శోభన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తును ముమ్మరం చేశారు. స్వప్న ఆచూకీ కోసం వెతుకుతుండగా, హైదరాబాద్ నగరంలోని నారాయణగూడ పోలీస్‌స్టేషన్ ఏరియాలో వసతిగృహంలో ఉంటూ ప్రైవేట్ ఉద్యోగం చేస్తున్నట్లు తెలిసింది. దీంతో శుక్రవారం పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్ నారాయణగూడ పోలీసులకు సమాచారం అందించి స్వప్నను తీసుకుని వచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు. 10 నెలల క్రితం ఇంటి నుంచి వెళ్లిపోయిన స్వప్న ఆచూకీని తెలుసుకుని తల్లిదండ్రులకు అప్పగించిన పుల్కల్ ఎస్ఐ పాటిల్ క్రాంతికుమార్‌కు స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు. కూతురు ఇంటికి చేరడంతో తల్లిదండ్రులులు సంతోషం వ్యక్తం చేశారు.

ముగిసిన భూలక్ష్మమ్మ జాతర

శివ్వంపేట, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : శివ్వంపేటలో రెండు రోజుల పాటు నిర్వహించిన భూ లక్ష్మమ్మ జాతర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, శివసతుల పూనకాలు, బోనాల ఊరేగింపుతో పండుగ వాతావరణం నెలకొన్నది. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ హరికృష్ణ, మాజీ జడ్పీటీసీ మహేష్‌గుప్తా, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సుదర్శన్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

టేక్మాల్‌లో ఘనంగా బండిషిడి

టేక్మాల్, మార్చి21(ఆంధ్రజ్యోతి) : టేక్మాల్‌లో నిర్వహిస్తున్న దుర్గమ్మ, పోచమ్మ జాతర ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం బండిషిడిని వైభవంగా నిర్వహించారు. బండిషిడిపై అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించారు. నేడు నిర్వహించే కుస్తీ పోటీలకు మల్లాయోధులు అధిక సంఖ్యలో పాల్గొని విజవంతం చేయాలని ఈవో రాకేష్ తెలిపారు

శ్రమించి.. కొలువు సాధించి

గొర్రెలకాపరి నుంచి ప్రభుత్వ ఉద్యోగానికి

నాలుగు సర్కారు నౌకరీలను సాధించిన ముద్దాపూర్ ముద్దుబిడ్డ

భార్య పద్మ సైతం జూనియర్ లెక్చరర్

మెదక్ కల్చరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : ఎస్జీటీ ఉపాధ్యాయుడు.. గురుకుల డిగ్రీ లెక్చరర్‌గా.. గ్రూప్ 4 ఉద్యోగి... తాజాగా జూనియర్ లెక్చరర్.. ఈ నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించింది ఓ నిరుపేద యువకుడు. అతను పూట గడవడం కోసం చేయని కష్టమంటూ లేదు.. గొర్రెలకాపరిగా, పొలంలో కూలీగా.. క్యాటరింగ్ బాయ్‌గా ఇలా ఎన్నో పనులు చేస్తూనే చదువుకున్నాడు. తాను అనుకున్నది సాధించాలనే సంకల్పంతో కదిలాడు.. ఏకంగా నాలుగు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించాడు. మెదక్ జిల్లా పాపన్నపేట మండల పరిధిలోని ముద్దాపూర్ గ్రామానికి చెందిన కుర్మ నవీన్‌కుమార్ పోటీ పరీక్ష ఏదైనా మొదటి ప్రయత్నంలోనే విజయంసాధిస్తూ ఉద్యోగం పొంది యువతకు స్ఫూర్తిగా నిలుస్తున్నాడు.

కష్టపడి..

వ్యవసాయం, గొర్లకాపరిగా పనిచేసుకుంటూ జీవనం సాగించే కురుమ లక్ష్మి, రాములు దంపతులకు నాల్గో సంతానం నవీన్‌కుమార్.. చిన్నప్పటి నుంచి ప్రభుత్వ విద్యాసంస్థల్లోనే చదువుకున్నాడు. ప్రాథమిక విద్య ముద్దాపూర్‌లో, పాపన్నపేట ఉన్నత పాఠశాలలో పదోతరగతి వరకు, పాపన్నపేట జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియట్, సూర్యాపేటలోని ఓ ప్రైవేట్ కాలేజీలో కన్వీనర్ కోటాలో డీఎడ్, మెదక్ డిగ్రీ కళాశాలలో డిగ్రీ పూర్తి చేశాడు. ఉస్మానియా యూనివర్సిటీ ఆర్ట్స్ కాలేజీలో ఎంఏ తెలుగు చదివారు. చిన్నప్పుడు కుటుంబ పరిస్థితుల వలన 3,4 తరగతుల స్థాయి నుంచే వ్యవసాయ పనులు, గొర్రెలకాపరిగా వెళ్లాల్సిన దుస్థితి వచ్చేది. కుటుంబ పరిస్థితుల ఆర్థిక నేపథ్యంతో సోదరులిద్దరి మాదిరిగానే పదో తరగతి అయిపోగానే చదువు మానేయాలని తల్లిదండ్రులు అనే వారు. కానీ ఎలాగైనా చదవాలనే సంకల్పంతో తల్లిదండ్రికి తెలియకుండా వెళ్లి ఇంటర్‌లో అడ్మిషన్ పొందాడు. సెలవులు ఉన్నప్పుడల్లా తండ్రికి సాయంగా గొర్రెలను మేపడానికి వెళ్లేవాడు. ఇంటర్ తర్వాత డైట్ చేసే సమయంలో ఖర్చుల కోసం ప్రైవేట్ కంపెనీలో రాత్రి కూలీగా, ఆదివారాలు క్యాటరింగ్ బాయ్‌గా మారాడు.





గొర్రెలను కాస్తున్న నవీన్‌కుమార్(ఫైల్)

తాను చదువుకున్న పాపన్నపేట జూనియర్ కళాశాలలోనే ప్రస్తుతం జూనియర్ లెక్చరర్‌గా నవీన్

మొదట ఎస్జీటీ ఉపాధ్యాయుడిగా

డిగ్రీ చేస్తూ డీఎస్సీకి సన్నద్ధమై ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా ఉమ్మడి మెదక్ జిల్లా ఓపెన్ కోటాలో ఉద్యోగం సాధించాడు. ఎస్‌జీటీ ఉపాధ్యాయుడిగా ఉద్యోగంలో చేరడానికి వచ్చిన కొద్దిసమయంలోనే ఉస్మానియా యూనివర్సిటీ పీజీ ప్రవేశ పరీక్షలో స్టేట్ సెకండ్ ర్యాంక్ సాధించాడు. పీజీ చదువుతున్న సమయంలో నెట్‌కు అర్హత సాధించాడు. ఉపాధ్యాయుడిగా ఉద్యోగం చేస్తూనే నెట్ సన్నద్ధమవుతూ జేఆర్‌ఎఫ్ సాధించాడు. అనంతరం సెట్‌లో రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు సాధించారు. మొదట్లో టీచరు ఉద్యోగమే జీవిత లక్ష్యంగా ఉన్న నవీన్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూనే గురుకుల డీఎల్, జనరల్ జేఎల్‌కి సన్నద్ధమయ్యారు. గురుకుల డీఎల్ ఫలితాల్లో రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు సాధించాడు. అదేవిధంగా జనరల్ జూనియర్ లెక్చరర్ పరీక్షల్లో సైతం తెలుగు విభాగంలో రాష్ట్రస్థాయి రెండో ర్యాంకు కైవసం చేసుకున్నాడు. తాను చదువుకున్న పాపన్నపేట జూనియర్ కళాశాలలోనే పోస్టింగ్ తీసుకోవడం విశేషం. గతంలో గ్రూప్-4లో మెరుగైన ర్యాంక్ సాధించినప్పటికీ బోధన మీద మక్కువతో అటువైపు వెళ్లలేదు. అయితే, అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా స్థిరపడడమే తన అంతిమ లక్ష్యమని నవీన్ తెలిపారు.

భార్యాభర్తలకు ఒకేసారి

ఉస్మానియా యూనివర్సిటీలో నవీన్, పద్మ ఎంఏ తెలుగు చేస్తున్న సమయంలో కలిసి చదువుకున్నారు. పద్మది కరీంనగర్ జిల్లా చొప్పదండి. ఆశయాలు ఒకటే కాబట్టి పద్మ, నవీన్ జీవితంలో ఉన్నతంగా ఎదిగి కలిసి బతకాలనుకున్నారు. పద్మ ఓయూలోనే పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతూ నెట్‌కు అర్హత పొందారు. ఓయూలోనే పీహెచ్‌డీలో చేరారు. పీహెచ్‌డీ చేస్తూనే గతేడాది గురుకుల బోర్డు విడుదల చేసిన డిగ్రీ లెక్చరర్ ఫలితాలలో తెలుగు విభాగంలో రాష్ట్రస్థాయి 8వ ర్యాంక్, మహిళల విభాగంలో రాష్ట్రస్థాయి మొదటి ర్యాంక్ సాధించారు. ఇటీవల టీఎస్పీఎస్సీ విడుదల చేసిన జూనియర్ లెక్చరర్స్ పరీక్షలలో రాష్ట్రస్థాయి 13వ ర్యాంక్ మల్టీజోన్ 4వ ర్యాంక్ సాధించి మెదక్ జిల్లా కేంద్రంలో ఉన్న బాలికల జూనియర్ కళాశాలలో తెలుగు అధ్యాపకురాలిగా ఉద్యోగం సాధించారు. ఇద్దరికీ జూనియర్ లెక్చరర్ ఉద్యోగం ఖాయం కాగానే ఇరు కుటుంబసభ్యులను ఒప్పించి వివాహబంధంతో ఒక్కటయ్యారు.

సాహిత్యంపై మక్కువ

చిన్నప్పటి నుంచి పాటల రచన గురించి ఆసక్తి చూపే నవీన్ తెలంగాణ ఉద్యమం సమయంలో తన వంతుగా ఉద్యమ గొంతుకై నిలిచాడు. ఉద్యమ పాటల ప్రభావంతో పాటల రచనపై ఉన్న ఆసక్తి తెలుగు సబ్జెక్టు వైపు మళ్లిందని అంటాడు. సమాజాన్ని చైతన్యపరిచే పాటల రచనలు చేస్తూ అందరి నుంచి అభినందనలు పొందుతున్నాడు. ఒకసారి మెదక్ సాహిత్య కార్యక్రమానికి విచ్చేసిన కవి నందిని సిధారెడ్డి నవీన్ రాసి పాడిన బతుకమ్మ పాట విని అభినందించారు.



నియామక పత్రాలతో నవీన్, పద్మ

మళ్లీ సంగారెడ్డి కెనాల్ భూసేకరణ

- రైతుల ఆందోళనతో కొన్నాళ్లు స్తబ్దుగా అధికారులు
- ఉన్నతాధికారుల ఆదేశంతో మళ్లీ రంగంలోకి
- పరిహారం ఖరారు కాకుండా రైతులు సహకరించేనా?

నర్సాపూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం కాలువ పనులు మధ్యలోనే ఆగిపోయాయి.. ఇంకా మొదలుపెట్టని సంగారెడ్డి కెనాల్ పనులు అటకెక్కినట్లే అని అనుకున్న రైతులకు మళ్లీ టెన్షన్ మొదలైంది. సంగారెడ్డి కెనాల్ కోసం భూసేకరణ ప్రక్రియ త్వరగా పూర్తి చేయాలని ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రావడంతో తిరిగి ప్రక్రియను మొదలు పెడుతున్నారు.

సిద్దిపేట జిల్లా కొండపోచమ్మసాగర్ నుంచి సంగారెడ్డి జిల్లా సింగూరు ప్రాజెక్టు వరకు సంగారెడ్డి కాలువ పేరిట కాలువను ఆయా గ్రామాలలో చెరువులకు అనుసంధానం చేస్తూ ఏర్పాటు చేయడానికి గత ప్రభుత్వంలోనే సర్వే నిర్వహించి భూసేకరణ ప్రక్రియ చేపట్టారు. కాలువ నిర్మాణం కోసం టెండరు ప్రక్రియ కూడా పూర్తయింది. గతేడాది జూన్ మాసంలో ఆయా గ్రామాల వారీగా సమావేశాలు నిర్వహించి రైతుల ఆమోదం కోసం ప్రయత్నించారు. పచ్చని పంటలు పండుతున్న భూములను తాము ఇచ్చి రోడ్డుపాలు కామని, తమ జీవనాధారమైన భూములను కోల్పోయి తామెట్ల బతకాలంటూ ఆయా గ్రామాల రైతులు అప్పట్లో పెద్దఎత్తున ఆందోళన చేపట్టారు. అధికారులను అడ్డుకుంటూ భూసేకరణ ప్రక్రియకు ఆటంకం సృష్టించారు. కొన్నిరోజుల తర్వాత ఏ కారణం చేతనో గానీ సంగారెడ్డి కెనాల్ సంబంధించిన ప్రక్రియను పక్కకు పెట్టారు. దీంతో ఇప్పటికే నిర్మాణం జరుగుతున్న కాళేశ్వరం కాలువ పనులు అసంపూర్తిగా నిలిచిపోయాయి ఇక సంగారెడ్డి కాలువ పనులు అటకెక్కినట్లేనని ఆయా గ్రామాల రైతులు ఆశించారు. అయితే, మళ్లీ తాజాగా ఉన్నతాధికారుల నుంచి సంగారెడ్డి కెనాల్ కోసం అసంపూర్తిగా ఉన్న భూసేకరణ ప్రక్రియ పూర్తి చేయాలని నర్సాపూర్ డివిజన్ అధికారులకు ఆదేశాలు రావడంతో తిరిగి పనులు మొదలు పెట్టడానికి సిద్ధమవుతున్నారు.



సర్వే అధికారులను అడ్డుకున్న చిన్నచింతకుంట రైతులు(ఫైల్)

పరిహారంపై స్పష్టతేది?

డివిజన్ పరిధిలోని నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట, రెడ్డిపల్లి, చిప్పల్‌తుర్తి, బ్రాహ్మణపల్లి, చిన్నచింతకుంట, లింగాపూర్ గ్రామాల్లో 491 మంది రైతుల నుంచి 258 ఎకరాల మేర వరకు సేకరిస్తున్నారు. శివ్వంపేట మండలం చెన్నాపూర్, పెద్దగొట్టిముక్ల, సికింద్లాపూర్, పిల్లుట్ల, చిన్నగొట్టిముక్ల, తిమ్మాపూర్, శివ్వంపేట, గోమారం గ్రామాల్లో 836 మంది రైతుల నుంచి 245 ఎకరాల వరకు సేకరించనున్నారు. గత ప్రభుత్వంలోనే ఏ ఏ గ్రామంలో ఎంతమేర ఏ రైతు వద్ద నుంచి భూసేకరణ చేయనున్నది సమావేశాలు నిర్వహించి తెలిపారు. ప్రస్తుతం అవార్డు స్టేజీలో ఉండగా, అధికారులు తిరిగి గ్రామాలకు వెళ్లి సర్వే చేయడానికి సిద్ధమవుతున్నారు. ప్రస్తుతం ఈ ప్రాంతంలో ఎకరా రూ.50 లక్షలకుపైగా పలుకుతుండగా ప్రభుత్వం నుంచి ఎకరాకు ఎంత ఇస్తారనే విషయం స్పష్టత లేకపోవడంతో రైతులు భూమి ఇవ్వడానికి తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారు. పైగా ఆయా కుటుంబాలకు ఈభూములే జీవనాధారం కావడంతో, తామెలా బతకాలని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో సంగారెడ్డి కెనాల్ భూసేకరణ ప్రక్రియ సజావుగా సాగుతుందా లేదా చూడాలి.

కేంద్రమంత్రిని కలిసిన ఎమ్మెల్సీ అంజిరెడ్డి

రామచంద్రాపురం టౌన్ మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : పట్టభద్రుల ఎమ్మెల్సీగా విజయకేతనం ఎగురవేసిన అంజిరెడ్డి శుక్రవారం ఢిల్లీలో బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డాను కలిశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు లక్ష్మణ్, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్, పార్టీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు గోదావరి, ఎంపీలు డీకె అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ కొమరయ్య, మాజీ ఎమ్మెల్సీ రామచంద్రరావు, నగేష్ తదితరులు ఉన్నారు.



జేపీ నడ్డాతో ఎమ్మెల్సీ అంజిరెడ్డి, గోదావరి

గీతం ఎంబీఏకు ప్రతిష్టాత్మక ఎన్‌బీఏ గుర్తింపు

పటాన్‌చెరు రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం హైదరాబాద్ క్యాంపస్‌లోని స్కూల్ ఆఫ్ బిజినెస్ నిర్వహిస్తున్న మాస్టర్ ఆఫ్ బిజినెస్ అడ్మినిస్ట్రేషన్ (ఎంబీఏ) కోర్సుకు ప్రతిష్టాత్మక నేషనల్ బోర్డ్ ఆఫ్ అక్రిడిటేషన్ (ఎన్‌బీఏ) గుర్తింపు లభించినట్లు శుక్రవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. ఈ గుర్తింపు 2028 జూన్ 30 వరకు మూడేళ్ల పాటు అమలులో ఉంటుందని తెలిపారు. డీమ్డ్ విశ్వవిద్యాలయ హోదాను 2007లో పొందిన తరువాత గీతం అందుకున్న మొదటి ఎన్‌బీఏ అక్రిడిటేషన్ ఇదని పేర్కొన్నారు. ఉపకులపతి ప్రొఫెసర్ ఎర్రోల్ డిసౌజా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్, అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీఎస్ రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, స్కూల్ ఆఫ్ బిజినెస్ డైరెక్టర్ డాక్టర్ దివ్య కీర్తి గుప్తా తదితరులు హర్షం వ్యక్తం చేశారు. బిజినెస్ మేనేజ్ మెంట్ విద్యలో ప్రముఖ సంస్థగా గీతం స్థానాన్ని ఈ గుర్తింపు పునరుద్ఘాటిస్తోందని తెలిపారు. అంతర్జాతీయ సంతోష దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆనందాన్ని సృష్టించే (క్రాఫ్టింగ్ జాయ్) కార్యక్రమాన్ని గీతం విద్యార్థి విభాగం ఉడాన్ నిర్వహించింది. వేడుకలలో భాగంగా ఫ్లాష్ డ్యాన్స్, బంకమట్టితో బొమ్మల తయారీతో పాటు పుస్తక పఠన కార్యక్రమాలలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండ్లలో దాహం..దాహం

5వ పేజీ తరువాయి

గురయ్యే ప్రమాదం ఉంటుంది. ఇలాంటి సందర్భాలను అధికారులు పరిగణనలోకి తీసుకోవాలి.

ఒక్కో బస్టాండ్‌లో ఒక్కోరకంగా..

- సంగారెడ్డి పాత బస్టాండ్‌లో సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో మంచినీటి ఫ్రిజ్‌ను ఏర్పాటు చేసినప్పటికీ ప్రారంభించలేదు.
- నర్సాపూర్ బస్టాండ్‌లో ఇటీవల మంచినీటి ఫ్రిజ్‌ను ఏర్పాటు చేశారు. కానీ గ్లాసులు లేక ప్రయాణికులు నల్లాలకు చేతులు పెట్టి తాగుతున్నారు.
- తూప్రాన్ బస్టాండ్‌లో తాగునీటి వసతి లేదు. లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రం మూసివేసి ఉంది.
- జోగిపేట బస్టాండ్‌లో చల్లని నీరు ప్రయాణికులకు అందుబాటులో ఉంది.
- హుస్నాబాద్ బస్టాండ్‌లో ఫ్రిజ్‌లు లేవు. కానీ ట్యాంకు ద్వారా తాగునీటిని అందిస్తున్నారు.
- చేర్యాల బస్టాండ్‌లో బోర్ నీళ్లతో అనుసంధానంగా పైపులు ఉన్నాయి. ఈ నీటినే ప్రయాణికులు తాగుతున్నారు. ఇక్కడ అపరిశుభ్ర వాతావరణం ఉంది.
- నారాయణఖేడ్ బస్టాండ్‌లో బోరు బావి అడుగంటిపోయింది. ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. వాటర్ ఫ్రీజర్ ఉన్నప్పటికీ మినరల్ వాటర్‌ను కొనుగోలు చేసి అందులో పోయిస్తున్నారు.
- జహీరాబాద్ బస్టాండ్‌లోని నల్లాల వద్ద కొందరు అపరిశుభ్రం చేయడంతో నల్లాలు తొలగించారు. బస్సులు గ్యారేజిలోకి వెళ్లే చోట నల్లాలు ఏర్పాటు చేశారు.
- సదాశివపేట ఆర్టీసీ బస్టాండ్‌లో తాగునీటి కోసం నిర్మించిన వాటర్ ట్యాంకు వద్ద ఒక నల్లా పనిచేయడం లేదు. మరొక నల్లా నుండి నీళ్లు సరిగా రావడం లేదు. అపరిశుభ్ర వాతావరణం ఉండడంతో ప్రయాణికులు నీళ్లు తాగడానికి ఇష్టపడట్లేదు. ఇక్కడున్న ఫ్రిజ్ సైతం నిరుపయోగంగానే మారింది.



చేర్యాల బస్టాండ్‌లో తాగునీటి ట్యాంకు వద్ద అపరిశుభ్రత

మల్లన్న ఆలయానికి వెళ్లివస్తూ కొమురవెల్లి శివారులో ఆటో బోల్తా

- వరంగల్‌కు చెందిన భక్తురాలి మృతి

చేర్యాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మల్లన్నను దర్శించుకుని ఇంటికి తిరుగు ప్రయాణమవగా, గ్రామ శివారులోనే ఆటో బోల్తాపడి ఓ భక్తురాలు అక్కడికక్కడే దుర్మరణం చెందగా, పలువురికి గాయాలైన సంఘటన శుక్రవారం రాత్రి జరిగింది. వరంగల్ జిల్లా కాశీబుగ్గకు చెందిన భక్తురాలు సబిత(55) కుటుంబ సభ్యులతో పాటు పొరుగు గ్రామాలకు చెందిన పలువురు భక్తులు కొమురవెల్లి మల్లన్నను దర్శించుకుని మొక్కు లు తీర్చుకున్నారు. శుక్రవారం రాత్రి చేర్యాల మీదుగా ఇంటికి బయలుదేరారు. ఆలయ సమీపంలో చేర్యాల మండలం వేచరేణి గ్రామానికి చెందిన ఇస్మాయిల్ ఆటో ఎక్కారు. ఇదే సమయంలో వర్షం కురుస్తున్నది. రోడ్డుపై గుంతలను తప్పించుకునే క్రమంలో చేర్యాల - కొమురవెల్లి దారిలోని ఫంక్షన్‌హాల్ సమీపంలో ఆటో బోల్తా పడింది. దీంతో సబిత అక్కడికక్కడే మృతిచెందింది. పలువురికి తీవ్ర, మరికొందరికి స్వల్పగాయాలయ్యాయి. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో చేర్యాల సీఐ ఎల్. శ్రీను సిబ్బందితో అక్కడికి చేరుకున్నారు. గాయాలపాలైన వారిని చికిత్స నిమిత్తం సిద్దిపేట ఏరియా ఆస్పత్రికి తరలించారు. బోల్తా ఘటనలో ఆటో దెబ్బతినగా, డ్రైవర్ ఇస్మాయిల్ ప్రాణాలతో బయటపడ్డాడు. కాగా మృతదేహాన్ని మార్చురీకి తరలించి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ రాజు తెలిపారు.



సబిత మృతదేహం



రోడ్డుపై బోల్తా పడిన ఆటో

బైక్ అదుపు తప్పి.. ఒకరి మృతి

రాయపోల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): బైక్ అదుపుతప్పి కింద పడడంతో ఒకరు మృతిచెందిన సంఘటన సిద్దిపేట జిల్లా రాయపోల్ మండలం వడ్డేపల్లి సమీపంలో చోటుచేసుకున్నది. ఎస్ఐ రఘుపతి కథనం ప్రకారం.. మెదక్ జిల్లా చేగుంట మండలం కసాన్‌పల్లి గ్రామానికి చెందిన లింగ రమేష్(39) గజ్వేల్‌లో సెంట్రింగ్ పని చేస్తున్నాడు. రోజు మాదిరిగానే గురువారం కసాన్‌పల్లి నుంచి సెంట్రింగ్ పని కోసం గజ్వేల్‌కు వెళ్లాడు. తిరిగి వస్తున్న క్రమంలో రాత్రి బైక్ అదుపుతప్పి కిందపడగా తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని ఆయనను గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రమేష్ భార్య లావణ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపడుతున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని మరొకరు

కంది, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతిచెందిన సంఘటన శుక్రవారం సంగారెడ్డి జిల్లా మండల పరిధిలోని కవలంపేట జాతీయరహదారి వద్ద జరిగింది. సంగారెడ్డి రూరల్ ఎస్ఐ రవీందర్ తెలిపిన వివరాల ప్రకారం.. కంది గ్రామానికి చెందిన రాములు(58) శుక్రవారం గణేష్‌గడ్డ నుంచి కందికి నడిచి వస్తున్నాడు. ఈ క్రమంలోనే హైదరాబాద్ నుంచి జహీరాబాద్ వైపు వెళ్తున్న ఓ గుర్తుతెలియని వాహనం కవలంపేట వద్ద రాములుని వెనకనుంచి బలంగా ఢీకొన్నది. దీంతో తలకు బలమైన గాయాలై రాములు ఘటనాస్థలంలోనే మృతిచెందాడు. సమాచారం తెలుకున్న పోలీసులు రాములు మృదేహానిక పంచనామా నిర్వహించి సంగారెడ్డిలోని ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. రాములు కటుంబసభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ఆర్టీసీ డ్రైవర్‌కు హైబీపీ.. తప్పిన ప్రమాదం

టేక్మాల్, మార్చి21(ఆంధ్రజ్యోతి) : ఆర్టీసీ బస్సు నడుపుతుండగా డ్రైవర్‌కు బీపీ పెరగగా, ప్రమాదం తప్పిన సంఘటన టేక్మాల్‌లో శుక్రవారం చోటుచేసుకున్నది. డ్రైవర్ మల్లయ్య తెలిపిన వివరాల ప్రకారం.. మెదక్ నుంచి బొడ్మాట్‌పల్లి వెళ్లే బస్సు టేక్మాల్ చౌరస్తాలోకి రాగానే డ్రైవర్‌కు కళ్లుతిరిగాయి. వెంటనే బస్సును నిలిపాడు. గమనించిన కండక్టర్ డ్రైవర్‌ను పీహెచ్‌సీకి తరలించారు. డ్రైవర్‌కు బీపీ ఎక్కువైందని వైద్యులు చికిత్స అందజేశారు.

ఖాళీ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం



అన్నపూర్ణ, జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్

గజ్వేల్, మార్చి 21(ఆంధ్రజ్యోతి): సిద్దిపేట జిల్లాలోని ఖాళీగా ఉన్న ఆయా పోస్టులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు గజ్వేల్ జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు. దుబ్బాక ఏరియా ఆసుపత్రిలో సీఏఎస్-గైనకాలజీ-1, పీఏఎస్ జీడీఎంఓ-1, సీహెచ్‌సీ నంగునూరులో సీఏఎస్ ఆర్థోపెడిక్-1, గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో సీఏఎస్ జీడీఎంవో-1, చేర్యాల సీహెచ్‌సీలో సీఏఎస్-జీడీఎంఓ-2 పోస్టులు ఉన్నాయని, ఈ పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ పోస్టుకు సంబంధిత స్పెషాలిటీలో పీజీ, డిగ్రీ, డీఎన్‌బీ లేదా డిప్లొమా కలిగి ఉండాలని, సీఏఎస్(జీడీఎంవో) పోస్టుకు ఎంబీబీఎస్ డిగ్రీ తప్పనిసరిగా ఉండడంతో పాటు తెలంగాణ మెడికల్ కౌన్సిల్‌లో రిజిస్ట్రేషన్ అయి ఉండాలన్నారు. 18 నుంచి 44 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలని, ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్ల వయస్సు సడలింపు ఉందన్నారు. స్థానిక రిజర్వేషన్ కలిగి ఉండాలని, పీజీ, డిగ్రీ, డీఎన్‌బీ, డిప్లొమాలో మంచి మార్కుల శాతం ఉండాలన్నారు. అభ్యర్థి దరఖాస్తు ఫారంతో పాటు 1 నుంచి 7వ తరగతి వరకు బోనఫైడ్ సర్టిఫికేట్, ఎస్సెస్సీ మెమో, ఎంబీబీఎస్ మార్కుల మెమో, మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్, కుల ధ్రువీకరణతో ఈ నెల 21 నుంచి 26వ తేదీ మధ్యలో గజ్వేల్ పట్టణంలోని జిల్లా ఆసుపత్రిలో అందజేయాలని డాక్టర్ అన్నపూర్ణ తెలిపారు.

ఆ 'డబుల్' ఇళ్ల మాటేమిటి?





గజ్వేల్ మండలం దాచారంలో చివరి దశలో నిలిచిన ఇళ్ల నిర్మాణం, గజ్వేల్‌లో పంపిణీ చేయని 'డబుల్' ఇళ్లు

- గత ప్రభుత్వంలో నియోజకవర్గానికి 4వేల ఇళ్లు మంజూరు
- పనులు పూర్తయిన వాటిలో దాదాపు 90 శాతం ఇళ్ల పంపిణీ పూర్తి
- పలుచోట్ల ఇళ్లలో ఉన్న లబ్ధిదారులకు అధికారికంగా అందని పత్రాలు
- మరికొన్ని గ్రామాల్లో అర్థాంతరంగా ఆగిన పనులు

గజ్వేల్/గజ్వేల్ డివిజన్ బృందం, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వ హయాంలో పేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను ఇవ్వాలనే సంకల్పంతో ప్రభుత్వ స్థలంలో ఇళ్లను నిర్మించతలపెట్టింది. ఈ క్రమంలోనే గజ్వేల్ నియోజకవర్గానికి నాలుగు వేల ఇళ్లను మంజూరు చేసింది. పలు గ్రామాల్లో ఇళ్లను పూర్తి చేసి లబ్ధిదారులకు అందించగా, మరికొన్ని గ్రామాల్లో కొన్ని పూర్తిచేసి మిగతావి అర్థాంతరంగా వదిలేశారు. ఇంకొన్ని గ్రామాల్లో మొత్తానికే నిర్మించకుండా వదిలేశారు. నిర్మించని గ్రామాలను వదిలేస్తే.. చివరి దశలో ఉన్న ఇళ్లను పూర్తి చేసి నిరుపేదలకు అందజేస్తే సొంతింటి కల నెరవేరుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఈ దిశగా ప్రభుత్వం ఆలోచన చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

నియోజకవర్గంలో ఇళ్ల పరిస్థితి ఇలా..

గజ్వేల్ నియోజకవర్గంలో మర్కుక మండలంలోని ఎర్రవల్లి, నరసన్నపేట, శివారువెంకటాపూర్, పాములపర్తి గ్రామాల్లో 226 డబుల్ బెడ్‌రూం ఇళ్లను, జగదేవ్‌పూర్ మండలంలోని చాట్లపల్లి, తీగుల్ గ్రామాల్లో 58, గజ్వేల్ మున్సిపాలిటీతో పాటు, గజ్వేల్ మండల పరిధిలోని కొడకండ్ల, సింగాటం, అక్కారం, దాచారం, బూరుగుపల్లి, శేర్‌పల్లి, బెజగామ, అహ్మదీపూర్, పిడిచెడ్ గ్రామాల్లో 1,585, ఉమ్మడి కొండపాక మండలంలోని మేదినిపూర్, కొండపాక, వెలికట్ట, విశ్వనాథపల్లి, ఖమ్మంపల్లి, నాగిరెడ్డిపల్లి, అంకిరెడ్డిపల్లి, జప్తినాచారం, దుద్దెడ గ్రామాల్లో 434, ములుగు మండలంలోని ములుగు, చిన్న తిమ్మాపూర్, అచ్చాయిపల్లి, క్షీరసాగర్, నాగిరెడ్డిపల్లి, శ్రీరాంపూర్, బస్వాపూర్, బండ మైలారం గ్రామాల్లో 370, వర్గల్ మండలంలోని తునికి కాల్సా గ్రామంలో 98 ఇళ్లను గత ప్రభుత్వం మంజూరు చేసింది. వీటిలో దాదాపుగా 90శాతం పూర్తవడంతో పాటు లబ్ధిదారులకు అందజేశారు.

అయోమయంలో పత్రాలు అందని లబ్ధిదారులు

గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మునిసిపాలిటీ పరిధిలోని డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి 2023, మార్చిలో లక్కీడ్రా ద్వారా లబ్ధిదారులకు ఎంపిక చేసినప్పటికీ ఇప్పటికీ అధికారికంగా డబుల్ బెడ్ రూం ఇళ్లను లబ్ధిదారులకు అందించలేదు. ఈ ఇళ్లలో మల్లన్నసాగర్ భూనిర్వాసితులు ఉండడంతో వారు ఇళ్లను ఖాళీ చేస్తుంటే లక్కీ డ్రా ద్వారా ఎంపికైన లబ్ధిదారులు నదరు ఇళ్లలోకి వెళ్తున్నారు. కానీ అధికారికంగా ఎలాంటి సర్టిఫికెట్లను అందించలేదు. ఇప్పటికే 8మార్లు లబ్ధిదారులు ఆర్డీవో, మునిసిపల్ కార్యాలయాల ఎదుట ధర్నాకు దిగారు. ఇక గజ్వేల్ మండలంలోని దాచారంలో చివరి దశలో ఉండగా, అక్కారం గ్రామంలో దాదాపు ఆరు ఇళ్లు పెండింగ్‌లో ఉన్నాయి. ఇక కొండపాక మండలంలోని ఖమ్మంపల్లిలో లబ్ధిదారుల ఎంపిక విషయంలో గలాటా జరగగా అవి పెండింగ్‌లోనే ఉన్నాయి. కొండపాక మండల కేంద్రంలో పలు ఇళ్లను పెండింగ్‌లో పెట్టగా, ములుగు మండలం బస్వాపూర్, బండ మైలారం గ్రామాల్లో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం మధ్యలోనే ఆగిపోయింది. వీటిని పూర్తి చేసి నిరుపేదలకు అందిస్తే వారి సొంతింటి కల నెరవేరుతుంది. ఆ దిశగా ప్రస్తుత ప్రభుత్వం ఆలోచన చేయాలని పలువురు కోరుతున్నారు.

పేకాట స్థావరంపై టాస్క్‌ఫోర్స్ పోలీసుల దాడి

సిద్దిపేట అర్బన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సిద్దిపేట అర్బన్ మండలం వెల్కటూర్ గ్రామ శివారులో పేకాట స్థావరంపై శుక్రవారం సిద్దిపేట టాస్క్ ఫోర్స్ పోలీసులు, త్రీ టౌన్ పోలీసులు దాడి చేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్టు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి రూ.9,480, మూడు మొబైల్ ఫోన్లు, స్వాధీనం చేసుకున్నారు.

తాగు.. సాగునీరు ఇవ్వడంలో విఫలం



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోరుకంటి చందర్

సిద్దిపేట అర్బన్/కొండపాక, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో సామాన్యులు, రైతులు ఇబ్బందిపడుతున్నారని, తాగు.. సాగు నీరు అందించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్ ఆరోపించారు. 'గోదావరి కన్నీటి గోస' పేరుతో ఆయన చేపట్టిన మహా పాదయాత్ర శుక్రవారం సిద్దిపేటకు చేరుకుంది. ఈ సందర్భంగా రెడ్డి సంక్షేమ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు అమలుకు సాధ్యం కానీ హామీలు ఇచ్చిన కాంగ్రెస్ అబద్ధపు పునాదులపై ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిందన్నారు. రైతులు సాగునీటి కోసం ఇబ్బందులు పడవద్దనే మాజీ సీఎం కేసీఆర్ మిషన్ కాకతీయ కింద చెరువుల పునరుద్ధరణ చేశారని, కాళేశ్వరం ద్వారా తెలంగాణ దశను మార్చారని పేర్కొన్నారు. కేసీఆర్‌పై కోపంతో ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని ఆరోపించారు. అంతకు ముందు కొండపాక మండలం దుద్దెడలో కోరుకంటి పాదయాత్రకు గజ్వేల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వంటేరు ప్రతాపరెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు స్వాగతం పలికాయి.

గంగమ్మ తల్లికి బోనాలు



జలపందిరితో బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్తున్న గంగపుత్ర సంఘం మహిళలు

చిన్నకోడూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : చిన్నకోడూరులోని గంగా భవానీ ఆలయం 23వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని శుక్రవారం గంగపుత్ర సంఘం ఆధ్వర్యంలో గంగమ్మతల్లికి మంగళహారతులతో పాటు, సదరు బోనాలు తీశారు. ఈ సందర్భంగా మంగళ హారతులు, బోనాలను గ్రామంలోని ప్రధాన వీధుల గుండా డప్పు చప్పుళ్లు, జలపందిరితో, శివసత్తుల పూనకాల మధ్య ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఆలయంలో గణపతిపూజ, అమ్మవారికి అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు.

మహిళల భద్రతకు అందుబాటులో పోలీసులు

- మానవ అక్రమ రవాణా నిరోధంపై మహిళా సంఘాలకు ఒకరోజు శిక్షణ



సమావేశంలో మాట్లాడుతున్న చేర్యాల సీఐ ఎల్ శ్రీనివాస్

చేర్యాల/మిరుదొడ్డి/కొండపాక/జగదేవ్‌పూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని పలు మండలాల్లో శుక్రవారం మానవ అక్రమరవాణా, లైంగి వ్యాపారం,సైబర్ ఆధారిత అక్రమ రవాణా అంశాలపై మహిళా సంఘాల సభ్యులకు శుక్రవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. చేర్యాల పట్టణంలోని ఐకేపీ కార్యాలయ ఆవరణలో శుక్రవారం స్త్రీనిధి మండల సమాఖ్య ఆధ్వర్యంలో మానవ అక్రమ రవాణా, లైంగిక వ్యాపారం తదితర అంశాలపై వీసీ, వీసీఏలకు చేపట్టిన శిక్షణ కార్యక్రమంలో సీఐ ఎల్ శ్రీనివాస్ మాట్లాడారు. మహిళల భద్రతకు తాము ఎల్లవేళలా అందుబాటులో ఉండి భరోసా కల్పిస్తున్నామని చేర్యాల సీఐ ఎల్ శ్రీనివాస్ అన్నారు. బాల్య వివాహాలు చేయవద్దని, పిల్లల ప్రవర్తనను తల్లిదండ్రులు గమనించాలని సూచించారు. మిరుదొడ్డిలో ఐకేపీ కార్యాలయంలో మానవ అక్రమరవాణా తదితర అంశాలపై వీవో, వీవోఏలకు ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో గణేష్ రెడ్డి మానవ అక్రమ రవాణా జరగకుండా చూడాల్సిన బాధ్యత ప్రతిఒక్కరిపై ఉందన్నారు. కొండపాక రైతు వేదికలో జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ సిద్దిపేట వారి సహకారంతో మహిళా సంఘాల సభ్యులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎం ముగ్దుమ్, ఎంపీడీవో రాంప్రసాద్ పలు అంశాలపై అవగాహన కల్పించారు. జగదేవ్‌పూర్ మండల కేంద్రంలోని ఐకేపీ భవనంలో మహిళా సంఘాల సభ్యులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ చంద్రమోహన్, ఎంపీడీవో రాంరెడ్డి మాట్లాడుతూ సమాజంలో ప్రతి ఒక్కరిలో చైతన్యం తీసుకురావడం ద్వారానే మనుషుల అక్రమ రవాణాను, మహిళల పట్ల లైంగిక వేధింపులను అడ్డుకోవచ్చని తెలిపారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్వీ నాయకులు

సిద్దిపేట కల్చరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మాజీమంత్రి, ఎమ్మెల్యే హరీశ్‌రావు సహకారంతో ఆదివారం సిద్దిపేట పట్టణంలోని విపంచి కళా నిలయంలో నిర్వహించనున్న మహిళా జాబ్‌మేళాను సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్వీ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రెడ్డి యాదగిరి కోరారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు మేళా ఉంటుందన్నారు. హైదరాబాద్‌లోని ప్రముఖ ఎలక్ట్రానిక్ కంపెనీ సౌజన్యంతో మహిళా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. నిరుద్యోగ మహిళలు అందరు సద్వినియోగం చేసుకోవాలన్నారు. 10వ తరగతి పెయిల్, పాస్. ఇంటర్ లేదా ఏదైనా డిగ్రీ. ఐటీఐ. పాలిటెక్నిక్ పాస్, పెయిల్ అయినవారు కూడా జాబ్ మేళాకు హజరుకావచ్చన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీనివాస్‌రెడ్డి



శ్రీనివాస్‌రెడ్డి(అధ్యక్షుడు), సదానందం (ప్రధాన కార్యదర్శి)

హుస్నాబాద్ టౌన్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా యాళ్ల శ్రీనివాస్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం బార్ అసోసియేషన్ ఎన్నికలు పట్టణంలోని మున్సిఫ్‌కోర్టులో జరిగాయి. ఉపాధ్యక్షుడిగా బోయిని సురేష్, ప్రధాన కార్యదర్శిగా ఒగ్గోజు సదానందం, జాయింట్ సెక్రటరీగా జేరిపోతుల రవీందర్, కోశాధికారిగా కొంకట శ్రీనివాస్, లైబ్రరీ సెక్రెటరీగా బానోతు శ్రీనివాస్ నాయక్, స్పోర్ట్స్ సెక్రటరీగా చింతకింది భాస్కర్, సీనియర్ ఈసీ మెంబర్లుగా మునిగొండ ఏసుదాసు, కన్నోజు రామక్రిష్ణ, బాకం సంపత్, జూనియర్ ఈసీ మెంబర్లుగా దీకొండ ప్రవీణ్, సబ్బని శ్రీదేవి, స్వాతి, సంధ్యారాణి, మాధవిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారి రఘువీర్ తెలిపారు.

జీపీ కార్మికుల పెండింగ్ వేతనాలు చెల్లించాలి



నంగునూరులో భిక్షాటన చేస్తున్న కార్మికులు

నంగునూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్మికులకు పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలని గ్రామపంచాయతీ వర్కర్స్ యూనియన్ మండల ప్రధాన కార్యదర్శి చిట్యాల కనకయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం పంచాయతీ వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో నంగునూరులో భిక్షాటన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంచాయతీలలో పనిచేస్తున్న కార్మికులకు 4 నెలల నుంచి వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. ప్రభుత్వం మల్టీ పర్పస్ విధానాన్ని రద్దు చేసి కేటగిరి వారీగా వేతనాలు చెల్లించాలన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం పెండింగ్ వేతనాలను తక్షణమే విడుదల చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల కమిటీ అధ్యక్షుడు దేవులపల్లి రాజమౌళి, ఉపాధ్యక్షుడు పిల్లి రవీందర్, ఉపాధ్యక్షురాలు జీడికంటి కనకవ్వ, కార్యదర్శి బిళ్లం బాలయ్య, అంకని పర్శ రాములు, కనకయ్య తదితరులు పాల్గొన్నారు.

పోలీసులకు రాములోరి గోటి తలంబ్రాలు అందజేత



సీఐ సైదా చేతులమీదుగా తలంబ్రాలను అందుకుంటున్న పోలీసులు

గజ్వేల్ రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): రామకోటి రామరాజు పట్టుదల అమోఘమని గజ్వేల్ సీఐ సైదా అన్నారు. శుక్రవారం శ్రీరామకోటి భక్త సమాజం సంస్థ నిర్వహిస్తున్న భద్రాచల సీతారాముల కల్యాణానికి అందించే గోటి తలంబ్రాలు సీఐ సైదా చేతుల మీదుగా పోలీసు సిబ్బందికి అందజేశారు.

తైబజార్ ఆదాయం రూ. 60.71లక్షలు

జగదేవ్‌పూర్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గ్రామ పంచాయతీ సచివాలయం వద్ద తైబజార్ బహిరంగ వేలంపాటను శుక్రవారం నిర్వహించారు. వేలం పాటలో పశువుల సంతకు, కూరగాయల మార్కెట్‌కు వేలం నిర్వహించగా పశువుల సంతను రూ.52.01లక్షకు రాజేశం, కూరగాయల మార్కెట్‌ను జగదేవ్‌పూర్‌కు చెందిన దాచారం కనకయ్య రూ. 8.70 లక్షలకు దక్కించుకున్నారు. గ్రామ ప్రత్యేకాధికారిని, డీఎల్‌పీఓ లత మాట్లాడుతూ గతేడాది తైబజార్ వేలం ద్వారా 9 నెలలకు గాను రూ.29 లక్షలు ఆదాయం రాగా, ఈ ఏడాది వేలం ద్వారా రూ. 60.71 లక్షల సమకూరినట్టు తెలిపారు.

హుస్నాబాద్ అంగడి వేలం రెండోసారి వాయిదా

హుస్నాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): హుస్నాబాద్ మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో శుక్రవారం జరిగిన అంగడి వేలం రెండోసారి వాయిదా పడింది. ఇందులో పాల్గొన్న కాంట్రాక్టర్లు వేలం పాటకు ముందుకు రాకపోవడంతో మున్సిపల్ కమిషనర్ మల్లిఖార్జున్ వాయిదా వేసినట్లు ప్రకటించారు. గత సంవత్సరం రూ. 1.20 కోట్లు అంగడి ఆదాయం రాగా ఈసారి 5 శాతం ఎక్సెస్‌తో రూ. 1,26,27,300ల నుంచి వేలం పాట ప్రారంభించగా గుత్తేదారులు ముందుకు రాలేదు. దీంతో వేలాన్ని వాయిదా వేస్తున్నట్లు కమిషనర్ ప్రకటించారు. ఈ విషయాన్ని కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు.

ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదం పట్ల సంబరాలు

హుస్నాబాద్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ బిల్లు ఆమోదించిన సందర్భంగా శుక్రవారం హుస్నాబాద్ పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో దళిత సంఘాల నాయకులు సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు గాదెపాక రవీందర్, ముక్కెర సంపత్‌కుమార్, కొలుగూరి అశోక్, రాజశేఖర్, వినోద్, గడిపె బాలు, వేల్పుల రాములు, సాయిలు, జగ్జీవన్ తదితరులు పాల్గొన్నారు.

కష్టపడి పని చేస్తే విజయం సాధ్యమే: కలెక్టర్



ఆనంద నిలయం బాలసదనంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.మను చౌదరి

కొండపాక,మార్చి 21 (ఆంధ్రజ్యోతి): క్రమశిక్షణతో కష్టపడి పనిచేస్తే ఏ రంగంలోనైనా విజయం సాధించవచ్చని సిద్దిపేట జిల్లా కలెక్టర్ ఎం.మను చౌదరి పేర్కొన్నారు. శుక్రవారం కొండపాకలోని ఆనందనిలయాన్ని సందర్శించారు. ఆనందనిలయం ఆవరణలో గల బాలసదనంలోని చిన్నారులతో ముచ్చటించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో ఏ రంగంలో విజయం సాధించాలన్నా ఇప్పటి నుంచే క్రమశిక్షణతో కష్టపడి చదవాలన్నారు. పిల్లలకు అవసరమయ్యేలా ఒక కంప్యూటర్‌ను అందజేస్తామని తెలిపారు. ముందుగా ఆనంద నిలయం సమీపంలో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయాన్ని చేరుకొని స్వామివారికి పూజలు నిర్వహించారు. అనంతరం ఆనంద నిలయంలో వృద్ధాశ్రమంలో ఉంటున్న వృద్ధుల వసతులను, డైనింగ్‌హాల్‌ను పరిశీలించి వారు పొందుతున్న సౌకర్యాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ప్రధాన రహదారి నుంచి ఆనంద నిలయం వరకు తాత్కాలిక గ్రావెల్ రోడ్డు నిర్మించాలని పంచాయతీరాజ్ ఈఈ గజ్వేల్ చిరంజీవికి సూచించారు. కార్యక్రమంలో కొండపాక తహసీల్దార్ దిలీప్ కుమార్, ఎంపీడీవో వెంకటేశ్వర్లు ఆనంద నిలయం ట్రస్టు సభ్యులు బెజగామా వెంకటేశం పెద్ది వైకుంఠం రాజమౌళి తదితరులున్నారు.

కోర్టు భవనానికి స్థల పరిశీలన

దుబ్బాక, మార్చి 21(ఆంధ్రజ్యోతి): దుబ్బాకలోని కోర్టు భవన నిర్మాణానికి జిల్లా కలెక్టర్ మనుచౌదరి, జిల్లా జడ్జి సాయిరామాదేవి స్థలాన్ని పరిశీలించారు. తాత్కాలిక కోర్టు స్థలంలో కోర్టు భవనాన్ని నిర్మించడానికి సర్వే చేయనున్నట్టు తెలిపారు. ఇందుకోసం ఒక ఎకరం 30గుంటల భూమిని సేకరించినట్టు తెలిపారు. త్వరలోనే కోర్టు నిర్మాణ పనులను చేపడతామని, కోర్టు భవనంతోపాటు రెసిడెన్షియల్ భవనం నిర్మించనున్నట్టు తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో సదానందం, తహసీల్దార్ సంజీవ్‌కుమార్, ఎంఈడీవో భాస్కరశర్మ, కమిషనర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులున్నారు.

సమాజానికి కవిత్వం ఎంతో అవసరం

సిద్దిపేట కల్చరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): సమాజం మార్పు కోసం సకలం అన్వేషించి అక్షరాల వినసొంపుతో భావాత్మకమైన సవ్వడితో మార్పు తెచ్చేదే కవిత్వమని కవి ఐతా చంద్రయ్య పేర్కొన్నారు. ప్రపంచ కవితా దినోత్సవం సందర్భంగా సిద్దిపేటలో మహాత్మాగాంధీ పార్కులో శుక్రవారం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాలానుగుణమైన మార్పులతో పాటుగా సాహిత్య సృజన ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో కవులు ఉండ్రాళ్ల రాజేశం, ఎన్నవెల్లి రాజమౌళి, వరుకోలు లక్ష్మయ్య, బస్వ రాజ్‌కుమార్, కోణం పరశురాములు, చీకోటి రాములు, డాక్టర్ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు

విడతలవారీగా గ్రామాల అభివృద్ధి

నంగునూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): విడతలవారీగాగా గ్రామాల్లో కనీస మౌలిక వసతుల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని టీపీసీసీ కార్యదర్శి దేవులపల్లి యాదగిరి అన్నారు. శుక్రవారం నంగునూరు మండలం బద్దిపడగ గ్రామంలో రూ.15 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులను మండల పార్టీ అధ్యక్షుడు తప్పేట శంకర్ తో కలిసి ప్రారంభించారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖ, ఇన్‌చార్జి పూజల హరికృష్ణ సహకారంతో గ్రామాల అభివృద్ధికి నిధులు మంజూరు చేసినట్లు తెలిపారు.

ముగిసిన 'వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్'



సర్టిఫికెట్లు అందుకుంటున్న విద్యార్థులు

సిద్దిపేట కల్చరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ ఫెస్టివల్ రెండో రోజు ప్రభుత్వ డిగ్రీ కళాశాల సిద్దిపేటలో శుక్రవారం జరిగింది. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్, నోడల్ ఆఫీసర్ డాక్టర్ జి సునీత సభకు అధ్యక్షత వహించారు. రెండు రోజులపాటు జరిగిన ఈ కార్యక్రమంలో నోడల్ జిల్లా నుంచి విద్యార్థులు తమ అభిప్రాయాలను ఉపన్యసించారు. దాదాపు 800 మంది వీడియోలు అప్లోడ్ చేయగా స్క్రీనింగ్ కమిటీ 150 మందిని సెలక్ట్ చేసింది. వీరిలో 87 మంది హాజరై వన్‌నేషన్ వన్ ఎలక్షన్ అనే అంశంపై ప్రసంగించారు. అనంతరం వీరిలో 10 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసి, సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ముగింపు సమావేశంలో నెహ్రూ యువకేంద్ర యువజన అధికారి ఎం. రంజిత్ రెడ్డి, జిల్లా కోర్డినేటర్ డా. ఎం. శ్రద్ధానందం, వైస్ ప్రిన్సిపాల్ డా. వి అయోధ్య రెడ్డి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారులు డా.రాణి, డా. పుణ్యమ్మ, జి. బాలకిషన్, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్లకు కనీస వేతనాలను చెల్లించాలి

దుబ్బాక,మార్చి21(ఆంధ్రజ్యోతి): ఆశా వర్కర్లకు కనీస వేతనాలను చెల్లించాలని సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్ డిమాండ్ చేశారు. శుక్రవారం దుబ్బాక మండలంలోని తిమ్మాపూర్, రామక్కపేట పీహెచ్‌సీలోని వైద్యాధికారులకు ఆశా కార్యకర్తల ఆధ్వర్యంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జాతీయ ఆరోగ్యమిషన్ పథకాన్ని రెగ్యులర్ చేయాలని కోరారు. దేశ వ్యాప్తంగా పని చేస్తున్న ఆశా కార్మికులకు రూ.26వేల వేతనాన్ని చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు మంజుల, శ్యామల, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

సిద్ధప్ప వరకవికి ఘన నివాళి

కోహెడ, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గోల్కొండ కవి, తెలంగాణ తొలి సమాజ వేదాంత కవి సిద్ధప్ప వరకవి 41వ వర్ధంతిని కోహెడ మండలం గుండారెడ్డిపల్లిలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన తన భక్తులు స్వగ్రామంలోని ఆశ్రమంలో గల సమాధి వద్ద ఉన్న విగ్రహానికి పూజలు నిర్వహించి, పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సిద్ధప్ప కుమారుడు అనంతవరం మాణిక్య లింగం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

హుస్నాబాద్‌లో ఘనంగా వృక్షాబంధన్

హుస్నాబాద్‌రూరల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ అటవీ దినోత్సవాన్ని పురస్కరించుకుని హుస్నాబాద్‌లో వృక్షా బంధన్ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని సర్ సీవీ రామన్ హైస్కూల్‌లో ప్రిన్సిపాల్ నారాయణరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులు వృక్షాబంధన్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణలో విద్యార్థులు వివిధ రకాల మొక్కలు నాటారు.

గ్రామాభివృద్ధికి సీసీ రోడ్డు నిర్మాణాలు



మర్మాములలో సీసీ రోడ్డు పనులు

మద్దూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం ఎన్ఆర్ఈజీఎస్ ద్వారా అందించిన నిధులతో గ్రామంలో సీసీ రోడ్ల నిర్మాణాలు చేపట్టినట్లు కాంగ్రెస్ మండల ప్రధాన కార్యదర్శి ఊట్ల శ్రీధర్‌రెడ్డి తెలిపారు. గ్రామాభివృద్ధికి అందించిన రూ.20 లక్షల నిధులతో గతంలో వేసిన రోడ్లకు అనుసంధానంగా సీసీ రోడ్లు వేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి సత్వర చర్యలు

చేర్యాల, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సమస్యల పరిష్కారానికి చిత్తశుద్ధితో పాటుపడుతున్నామని టీఎస్ఎస్ పీడీసీఎల్ చేర్యాల ఏడీఈ వెంకట్ అన్నారు. పట్టణంలోని పలు వ్యవసాయబావుల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను శుక్రవారం పరిశీలించి రైతులతో మాట్లాడి విద్యుత్ సరఫరా తీరుపై ఆరా తీశారు. పట్టణంలోని బాలికల జడ్పీస్కూల్ సమీపంలోని ఎస్ఎస్-2 ట్రాన్స్‌ఫార్మర్‌ను వెంటనే మార్చి విద్యుత్ సరఫరా పునరుద్ధరించామన్నారు. లో-ఓల్టేజీ సమస్య లేదన్నారు. వెంట విద్యుత్ సిబ్బంది ప్రభాకర్‌రెడ్డి, పోతుగంటి శ్రీనివాస్ తదితరులున్నారు.

కాంగ్రెస్‌పార్టీలో కష్టపడేవారికి గుర్తింపు

నంగునూరు, మార్చి 21 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పని చేసే ప్రతీ కార్యకర్తకు గుర్తింపు లభిస్తుందని నంగునూరు మండల కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు ఎండీ ఇమ్రాన్ అన్నారు. శుక్రవారం ఆయన సిద్దిపేట జిల్లా అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ సాదుల ఆత్మ రాములును మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఆత్మ రాములు గతంలో ఎన్ఎస్ యూఐ ,యూత్ కాంగ్రెస్‌తో పాటు పలు పదవులు చేపట్టారు.

అధిక సాంద్రత పత్తి సాగుతో ఎక్కువ దిగుబడి

రాయపోల్, మార్చి 21 (ఆంధ్రజ్యోతి): అధిక సాంద్రత పద్ధతిలో పత్తిపంట సాగు చేస్తే తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించవచ్చని జిల్లా వ్యవసాయ అధికారి రాధిక పేర్కొన్నారు. శుక్రవారం రాయపోల్‌లో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి పంట సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆమె పాల్గొని రైతులకు పలుసూచనలు చేశారు. కృషి విజ్ఞాన కేంద్రం వ్యవసాయ శాస్త్రవేత్తలు డాక్టర్ నల్కర్, రవి, ప్రతాప్‌రెడ్డి పలు సూచనలు చేశారు.